సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 4 । జూలై । 2025



గాడితప్పిన పల్లెపాలన

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. నిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. 4లో▸



వాహనాల తనిఖీలు

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. 4లో▸



బాలికలను వేధిస్తే జైలుకే

పాఠశాలలు, కళాశాలల వద్ద బాలికలను వేధిస్తే జైలుకు పంపిస్తామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. 4లో▸

న్యూస్‌రీల్

సర్దార్‌నగర్‌ను సందర్శించిన తమిళనాడు బృందం



పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్క నాటుతున్న తమిళనాడు బృందం

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని తమిళనాడు బృందం గురువారం సందర్శించింది. గ్రామ పరిపాలన, పౌరసేవలు, వివిధ పథకాల అమలు బాగుందని కితాబిచ్చింది. ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ ద్వారా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సుపరిపాలన కేంద్ర) శిక్షణ బృందం అనిల్‌కుమార్, వెంకటరమణ తమిళనాడు సర్పంచులు, బ్లాక్ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారుల బృందంతో కలిసి గ్రామంలో సౌకర్యాలు, వనరులు, అభివృద్ధిని పరిశీలించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ భవనం, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి బాగున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రేపటినుంచి వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించనున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 9వ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దులజంగయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యలు, ఉపాధి హామీ కూలీల సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించి పోరాటాలకు రూపకల్పన చేయడం జరుగుతుందని వివరించారు. ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యతో పాటు రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారని చెప్పారు.

మార్కెట్ సిబ్బంది నిరసన



ఇబ్రహీంపట్నం: మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై ఆ కమిటీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ దాడి చేయడాన్ని ఖండిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ సిబ్బంది భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీఓ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వైస్ చైర్మన్‌ను పదవి నుంచి తొలగించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

హెచ్‌ఎండీఏ అనుమతులు అదుర్స్

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ పరిధిలో 'రియల్' పరుగు ఊపందుకుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, హైరైజ్ బిల్డింగ్‌లు, లే అవుట్ తదితర నిర్మాణ రంగానికి సంబంధించి 922 అనుమతులను (ప్రొసీడింగ్స్)ను ఇచ్చినట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. వీటిపై ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.519 కోట్లకు పైగా ఆదాయం లభించింది. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు అందజేసిన అనుమతుల కంటే ఈ ఏడాది జూన్‌వరకు నిర్మాణరంగ అనుమతులు పెరిగాయి. గత సంవత్సరం జూన్ నాటికి 388 అనుమతులు మాత్రమే అందజేయడం గమనార్హం. మొత్తంగా 2024లో హెచ్‌ఎండీఏ 878 అనుమతులను అందజేసింది. వీటిపై రూ.395.13 కోట్ల ఆదాయం లభించింది. మరోవైపు 2023లో 1,361 అనుమతులను ఇచ్చారు. రూ.563.32 కోట్ల ఆదాయం లభించింది. నిర్మాణరంగంలో ఎలాంటి స్తబ్దత లేదని, గత రెండేళ్లుగా పరుగులు పెడుతూనే ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 922 ప్రొసీడింగ్స్ ఇవ్వగా డిసెంబర్ నాటికి రెట్టింప య్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు అనుమతుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. బిల్డ్‌నౌ అందుబాటులోకి వచ్చిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరమైందన్నారు.

గుట్టలుగా చెత్త

మున్సిపాలిటీల్లో పేరుకుపోతున్న చెత్తాచెదారం



శంకర్‌పల్లి: డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారం

మున్సిపాలిటీలను చెత్త సమస్య వెంటాడుతోంది. డంపింగ్ యార్డులు లేకపోవడంతో సేకరించిన చెత్తనంతా పురపాలికల శివార్లలో డంప్ చేస్తున్నారు. దీంతో కుప్పలుగా పేరుకుపోతోంది. ఈగలు, దోమలు వ్యాప్తి చెందడంతో పాటు చెత్తను తరచూ తగులబెడుతుండడంతో దట్టమైన పొగలు వెలువడుతున్నాయి. చెత్తతో రోగాలపాలవుతున్నామని, పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

- సరైన డంపింగ్ యార్డులు కరువు
- శివార్లలో పడవేత.. కాల్చివేత
- అసౌకర్యానికి గురవుతున్న స్థానికులు

పోగైన చెత్తను పొగబెట్టి..



సోలీపూర్‌లో చెత్తను వేస్తున్న ప్రదేశం

షాద్‌నగర్: మున్సిపల్ పరిధిలో ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్న చెత్తనంతా ఊరు చివరన పడేస్తున్నారు. పోగైన చెత్తను కాల్చేస్తుండటంతో దట్టమైన పొగలు వ్యాపిస్తున్నాయి. దీంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మున్సిపల్ పరిధిలో 28 వార్డులు ఉన్నాయి. సుమారు 20వేల ఇళ్లు ఉన్నాయి. పట్టణంలో సుమారు లక్షకు పైగా జనాభా నివాసం ఉంటోంది. ప్రతి రోజు మున్సిపల్ సిబ్బంది సుమారు 33 మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్తను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 400 కిలోల వరకు కూరగాయల వ్యర్థాలు ఉంటున్నాయి. ఆరు ట్రాక్టర్లు, 28 ఆటోలను ఉపయోగిస్తూ ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను సేకరిస్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు సుమారు 102 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

సోలీపూర్ శివారులో డంపు

మున్సిపాలిటీ రోజుకురోజుకూ విస్తరిస్తోంది. పట్టణంలో సేకరించిన చెత్తను ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిలో పారబోస్తున్నారు. తరచూ చెత్తను కాల్చివేయడం ద్వారా పొగ గ్రామం మొత్తం వ్యాపిస్తోంది. చెత్తలో ఉన్న మాంసం వ్యర్థాల కోసం ఈ ప్రాంతంలో కుక్కలు విపరీతంగా సంచరిస్తున్నాయి. దోమలు, ఈగలు వ్యాప్తి చెందడంతో డంపింగ్ యార్డును తరలించాలని గ్రామస్తులు కొంత కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారి పక్కనే..



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన చెత్త డంపు

మొయినాబాద్: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై డంపింగ్ కంపు పెరిగింది. మున్సిపల్ పరిధిలోని చెత్తను హిమాయత్‌నగర్ రెవెన్యూలో జాతీయ రహదారి పక్కనే డంప్ చేస్తున్నారు. దీంతో రోడ్డుపై వెళ్లే వాహనదాలు, ప్రయాణికులు, స్థానికులు దుర్వాసన, ఈగలు, దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో 9 పంచాయతీలు విలీనమయ్యాయి. పంచాయతీలుగా ఉన్నప్పుడు అన్ని గ్రామాలకు డంపింగ్ యార్డులు వేర్వేరుగా ఉన్నాయి. ఆరు నెలల క్రితం మున్సిపాలిటీ ఏర్పాటైంది. పంచాయతీగా ఉన్నప్పటి నుంచి మొయినాబాద్‌కు డంపింగ్‌యార్డు లేదు. అప్పట్లో సురంగల్ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో డంప్ చేసేవారు. అక్కడి నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేస్తుండడంతో మున్సిపల్ కేంద్రంలోని చెత్తను ప్రస్తుతం హిమాయత్‌నగర్ రెవెన్యూలో జాతీయ రహదారి పక్కన పడేస్తున్నారు. మొయినాబాద్‌లోనే నిత్యం సుమారు 10-12 ట్రాక్టర్ల చెత్త వెలువడుతోంది. మొయినాబాద్, హిమాయత్‌నగర్ నుంచి వెలువడే చెత్తనంతా ఒకేచోట వేస్తుండం.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మరోవైపు మున్సిపాలిటీలోని ఏడు గ్రామాల్లో ఎక్కడి డంపింగ్ యార్డులు అక్కడే ఉన్నాయి.

స్థలంకోసం అన్వేషణ



పంచాయతీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డంపింగ్ యార్డులో వేస్తున్న చెత్త

చేవెళ్ల: కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ కావడంతో సరైన డంపింగ్ యార్డుకోసం స్థల అన్వేషణ జరుగుతోంది. పంచాయతీగా ఉన్న సమయంలో ఆయా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి అక్కడే డంపింగ్ చేశారు. మున్సిపాలిటీగా ఏర్పాటైన తరువాత 12 గ్రామాలకు సరిపడా డంపింగ్‌యార్డు ఒకేచోట ఏర్పాటుకు స్థలం కావాల్సి ఉంది. అనువైన స్థలం అందుబాటులోకి వచ్చాక చెత్త సేకరణతో కంపోస్ట్ ఎరువు తయారు చేయడంతో పాటు తడిపొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వేయనున్నారు. ప్రస్తుతం ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న చెత్తను అందుబాటులో ఉన్న డంపింగ్ యార్డుల్లో వేస్తున్నారు. డంపింగ్ యార్డులు రోడ్ల పక్కన నివాసాలకు దగ్గరలో ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

అస్తవ్యస్తంగా నిర్వహణ



ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లి పొగలను ఆర్పుతున్న సిబ్బంది

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పట్టణంలో నిత్యం 12టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా ఎక్కడా తడి, పొడిగా వేరు చేయడం లేదు. మున్సిపాలిటీకి చెత్తను డంప్ చేయడానికి సరైన డంపింగ్ యార్డు లేదు. ఉన్నా దాంట్లో ఇష్టం వచ్చినట్టు చెత్త పడేయడం, గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి వేసి వెళ్లడంతో నిరంతరం పొగలు వస్తూనే ఉంటాయి. సమీపంలోని కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిర్యాదు చేస్తే ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లి, పొగలను చల్లార్చుతున్నారు. ఇప్పటికైనా డంపింగ్ యార్డు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. కూరగాయల వ్యర్థాల ద్వారా నెలకి పది టన్నుల కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగతా చెత్తను సైతం ఎరువుగా మార్చాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

- ఎన్నికల హామీలు అమలు చేస్తున్నాం
- ఖర్గే సమావేశాన్ని విజయవంతం చేద్దాం
- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి.. సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకెళ్తున్నారని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఆయన నివాసంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమావేశానికి జిల్లా నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ పెద్దలు రాష్ట్రాన్ని దివాళా తీయించారని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా సీఎం రేవంత్‌రెడ్డి సమర్థవంతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడారు. పార్టీ కార్యక్రమాలపై ఖర్గే దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖర్గే సమావేశం చరిత్రలో నిలిచిపోనుందన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌టీఏ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ వైస్‌చైర్మన్ రమేష్‌కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మైపాల్‌రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు అనంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సు సౌకర్యం



డీఎం ఉష

షాద్‌నగర్‌రూరల్: గురు పౌర్ణమిని పురస్కరించుకొని తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించనున్నట్టు డీఎం ఉష అన్నారు. డిపో కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడారు. అరుణాచల క్షేత్రంలో ఈనెల 10న గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ నెల 8న రాత్రి 7 గంటలకు షాద్‌నగర్ నుంచి బయలుదేరి 9న ఉదయం 6 గంటలకు కాణిపాకం చేరుకుంటుందని, దర్శనం అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి బయలుదేరి అదే రోజు రాత్రి అరుణాచల క్షేత్రానికి చేరుకుంటుందని వివరించారు. 10న గిరిప్రదక్షిణ పూర్తయిన తరువాత సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి బయలు దేరి 11న ఉదయం 5గంటలకు షాద్‌నగర్ డిపోకు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.3,600, పిల్లలకు రూ.2,400 నిర్ణయించడం జరిగిందన్నారు. టికెట్ బుకింగ్ కోసం 94409 19113, 9490021433, 91826 45281, 99592 26287 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘన స్వాగతం

మహేశ్వరం: మండల కేంద్రంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తయారీ పరిశ్రమను ప్రారంభించడానికి గురువారం విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలు, గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, పీసీసీ జనరల్ సెక్రటరీ ఏనుగు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సబావత్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నందిగామ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను గజమాలతో సత్కరిస్తున్న నేతలు

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ సాధన

ఇబ్రహీంపట్నం: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని, ఉన్నతాధికారుల సూచనలు, సలహాల ప్రకారం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని డివిజినల్ లెవల్ పంచాయతీ అధికారి సాధన అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్-2025, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్, ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, సిటీజన్ సర్వీస్ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కార్యక్రమాల వివరాలను ఆయా శాఖల అధికారులు సోమవారం లోగా అందజేయాలన్నారు. వన మహోత్సవానికి ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. కాగా తమకు మూడు నెలలుగా వేతనాలు అందడంలేదని ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు సమావేశాన్ని బహిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ యెల్లంకి జంగయ్యగౌడ్, ఎంపీఓ రఘు, మండల వ్యవసాయాధికారిణి విద్యాధరి, మండల విద్యాధికారి హీర్యానాయక్, వైద్యాధికారులు మంజుల, సరిత, ఎస్‌ఐ నాగరాజు, మండల పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు ఉస్మాన్, రజిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం పనులు షురూ



పాఠశాల ఆవరణలో జేసీబీతో చదును

కందుకూరు: డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాంలో భాగంగా నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో గురువారం పనులు ప్రారంభించారు. వర్షపు నీరు ఇంకేలా పిట్ తవ్వకంతో పాటు ఔషధ మొక్కల పెంపకం కోసం స్థలాన్ని జేసీబీ యంత్రంతో సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విష్ణుప్రియ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడంతో వర్షం నీరు ఇంకి భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడుతుందన్నారు. ఔషధ మొక్కల పెంపకం చేపట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వాళ్ల ఇళ్ల వద్ద పెంచుకోవడానికి ఆసక్తి చూపుతారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పుష్పలత, గురురాజారెడ్డి, సీజీఆర్ సంస్థ కోఆర్డినేటర్ రజనీకాంత్, ఎర్త్ లీడర్స్ హాసిప్రియ, మధీహ, విజయదుర్గ, తేజస్విని, తరుణి, మాధవి, శ్రీకర్, హాసిని పాల్గొన్నారు.

ఫార్మా వద్దు.. ఫ్యూచర్ వద్దు

- బాధిత రైతుల ఆందోళన
- పాలకుల తీరుకు నిరసనగా పాదయాత్ర
- సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు

యాచారం: ఫార్మాసిటీ పేరుతో గత బీఆర్‌ఎస్ సర్కార్ రైతుల భూములను బలవంతంగా లాక్కుంటే.. ఫ్యూచర్‌సిటీ పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కూడా అదే పంథా అనుసరిస్తోందని ఆయా గ్రామాల రైతులు విమర్శించారు. ×ఫార్మాసిటీ వద్దు.. ఫ్యూచర్‌సిటీ అసలే వద్దు₹ అని నినదించారు. టీజీఐఐసీ పేరు మీద మార్చిన పట్టా భూముల రికార్డులను రైతుల పేరిట మార్చాలని.. భూసేకరణ నిలిపేయాలని.. అర్హులైన అసైన్డ్, కబ్జాలో ఉన్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో కుర్మిద్ద నుంచి తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి వరకు పాదయాత్ర నిర్వహించారు. నక్కర్తమేడిపల్లిలోని ఫార్మాసిటీ వ్యతిరేక స్థూపం వద్ద నల్లాజెండాలు కట్టి సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాలుగేళ్లుగా టీజీఐఐసీ పేరు మీదున్న భూ రికార్డులు రైతుల పేర్లపై నమోదు కాకపోవడంతో రైతుభరోసా, బ్యాంకు రుణాలు, అత్యవసర సమయాల్లో క్రయవిక్రయాలు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని హైకోర్టు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. ఫ్యూచర్‌సిటీ పేరుతో మళ్లీ భూములు కావాలని వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ముందు జాగ్రత్తగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ పీపుల్స్ జేఏసీ జాయింట్ కన్వీనర్ కన్నెగంటి రవి, మానవ హక్కుల వేదిక నుంచి విశ్రాంత శాస్త్రవేత్త బాబురావు, హైకోర్టు న్యాయవాది శ్రీకాంత్, కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్ మాజీ సర్పంచులు, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నల్లాజెండాలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పోటీపడి పైరసీ చేశాడు!

- వనస్థలిపురానికి చెందిన ఏసీ టెక్నీషియన్ వ్యవహారం
- ఏడాదిన్నరలో ఏకంగా 40 సినిమాలు అక్రమంగా లీక్
- ఒక్కో చిత్రానికి 300 నుంచి 400 డాలర్ల సంపాదన
- వ్యవస్థీకృతంగా దందా చేస్తున్న 1తమిళ్‌ఎంవీ సైట్
- నిందితుడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఏడాదిన్నరగా నగరంలోని వివిధ థియేటర్లను అడ్డాగా చేసుకుని దాదాపు 40 సినిమాలను రికార్డు చేసి, పైరసీ సైట్లకు విక్రయించిన ఘరానా నిందితుడు జన కిరణ్‌కుమార్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పైరసీ చిత్రాలను అందుబాటులో ఉంచే 1తమిళ్‌ఎంవీ అనే సైట్‌లో వచ్చిన ప్రకటన చూసి పోటీపడిన ఇతగాడు ఒక్కో సినిమాకు 300 నుంచి 400 డాలర్లు క్రిప్టో కరెన్సీ రూపంలో పొందాడని పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్‌కుమార్ వనస్థలిపురంలో ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. 1తమిళ్‌బ్లాస్టర్స్, 5మూవీ రూల్స్, 1తమిళ్‌ఎంవీ తదితర వెబ్‌సైట్లను తరచూ సందర్శించే ఇతగాడు వాటిలో ఉన్న పైరసీ సినిమాలు చూసేవాడు. ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం 1తమిళ్‌ఎంవీ సైట్‌లో 'పైరసీ పోటీ'కి సంబంధించిన ప్రకటన కిరణ్ దృష్టిని ఆకర్షించింది. కొత్తగా విడుదలైన సినిమాలను వీలైనంత త్వరగా రికార్డు చేసి, దాని హెచ్‌డీ ప్రింట్‌తో కూడిన లింక్‌ను తమకు పంపిస్తే ఒక్కో సినిమాకు 300 నుంచి 400 డాలర్లు చెల్లిస్తామన్నది ఆ పోటీ సారాంశం. దీనికి ఆకర్షితుడైన కిరణ్ ప్రొటాన్ మెయిల్ ద్వారా వారిని సంప్రదించాడు. తెలుగు చిత్రాలను రికార్డు చేసి పంపిస్తానంటూ సందేశం ఇచ్చాడు. పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండటానికి టెలిగ్రాం యాప్ ద్వారా సంప్రదింపులు జరపాలని నిర్ణయించుకున్న అతను తన ఖాతా ఐడీని వారికి పంపాడు. అప్పటి నుంచి సదరు వెబ్‌సైట్ నిర్వాహకులతో ఈ యాప్ ద్వారానే సమాచార మార్పిడి చేసుకున్నాడు. వారితో ఒప్పందం కుదుర్చుకున్న కిరణ్ కొత్తగా విడుదలయ్యే చిత్రాలకు సంబంధించి మొదటి షోకే ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే వాడు. సెల్‌ఫోన్‌లో రికార్డింగ్ ఆన్ చేసుకుని, షర్టు జేబులో పెట్టుకున్నా పక్కాగా రికార్డు అయ్యే సీటునే ఎంపిక చేసుకునే వాడు. ఈ రకంగా ఆ సినిమా మొత్తాన్ని రికార్డు చేసి, క్లౌడ్‌లో సేవ్ చేసే కిరణ్ దాని లింక్‌ను టెలిగ్రాం యాప్ ద్వారా వెబ్‌సైట్ నిర్వాహకులకు పంపేవాడు. దీనికి ప్రతిఫలంగా నిర్ణీత మొత్తాన్ని బిట్‌కాయిన్ల రూపంలో అందుకునే వాడు. ఈ క్రిప్టో కరెన్సీని జెబ్ పే, కాయిన్ డీసీఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో ఎక్స్ఛేంజ్ చేసుకుని రూపాయల్లోకి మార్చుకునేవాడు. ఇలా ఏడాదిన్నరలో పెళ్లికాని ప్రసాద్, 14 డేస్ లవ్, తండేల్, గేమ్ ఆన్, కిస్మత్, రాజధాని ఫైల్స్ సహా మొత్తం 40 చిత్రాలు రికార్డు చేసి పైరసీ వెబ్‌సైట్‌కు అందించాడు. ఈ ఏడాది మే 9న విడుదలైన హ్యాష్‌ట్యాగ్ సింగిల్ సినిమానూ ఇలానే చేశాడు. ఈ చిత్రం విడుదలైన రోజే ఆయా పైరసీ వెబ్‌సైట్లలో ఈ చిత్రం హెచ్‌డీ ప్రింట్ ప్రత్యక్షం కావడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) స్పందించింది. దాని అంతర్భాగమైన యాంటీ వీడియో పైరసీ సెల్ ప్రతినిధి సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదైన కేసును ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలను బట్టి కిరణ్ కుమార్ నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంది. పైరసీ కారణంగా గత ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమ రూ.3700 కోట్లు నష్టపోయినట్లు టీఎఫ్‌సీసీ అంచనా వేసిందని, ఈ నేపథ్యంలో పైరసీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

బాలికలను వేధిస్తే జైలుకే



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: పాఠశాలలు, కళాశాలల వద్ద బాలికలను వేధిస్తే జైలుకు పంపిస్తామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని జినుగుర్తి గేటు వద్ద ఉన్న మోడల్ స్కూల్ విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బాల్యం నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కష్టపడి చదివి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలని సూచించారు. బాలికలను వేధిస్తే పోక్సో చట్టం కింద జైలుకు పంపిస్తామన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలు కావొద్దని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, ప్రిన్సిపల్ శ్రీదేవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

షాద్‌నగర్‌రూరల్: రైలులో నుంచి జారిపడిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం సోలీపూర్ శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి(50) ఓ రైలు నుంచి జారి పట్టాల పక్కన ఉన్న రైల్వే కల్వర్టులోని చెట్ల పొదల్లో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న మహబూబ్‌నగర్ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియరాలేదు. మృతుడి శరీరంపై తెలుపు రంగు పూల షర్టు, గ్రే కలర్ ప్యాంటు, మెడలో తాయిత్త ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినా, ఆచూకీ లభించినా వెంటనే 9848090426 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఐజాక్ తెలిపారు.

రబ్బర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాటేదాన్‌లోని ఓ రబ్బర్ పరిశ్రమలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్‌కు చెందిన అనిల్‌సురేఖ కాటేదాన్‌లోని నేతాజీనగర్‌లో రబ్బర్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఉదయం 4 గంటల ప్రాంతంలో పరిశ్రమ నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాడితప్పిన పల్లెపాలన



షాబాద్ ఎస్సీ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

- జిల్లాలో నిధులు లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు
- ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువు
- పనిభారంతో ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- పల్లె ప్రకృతివనాలు, వైకుంఠధామాల పరిస్థితి అధ్వానం

షాబాద్: ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. పంచాయతీల్లో డబ్బులు లేక, ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతుంది. గతేడాది జనవరి 31తో గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో వీధి దీపాలు, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ కొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులకు సైతం జీతాలు చెల్లించలేని స్థితిలో పంచాయతీలున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడి పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేయడంతో పాటు సరైన నిర్వహణ లేక పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాల పరిస్థితి అధ్వానంగా మారింది.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం

జిల్లా వ్యాప్తంగా చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 21 మండలాల్లో మొత్తం 526 గ్రామ పంచాయతీలున్నాయి. 16 నెలల క్రితం గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగిస్తున్నది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ అంతంతామాత్రంగానే ఉండడంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం పెరిగింది. వనమహోత్సవం, ఉపాధిహామీ, పల్లెప్రగతి, ఇంటి పన్నుల వసూలు, పారిశుద్ధ్యం తదితర పనులతో పంచాయతీ కార్యదర్శులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ నిధులు రాకపోవడంతో పెద్ద సమస్యగా మారింది. ఒక్కో గ్రామ పంచాయతీలో వివిధ పనులు చేపట్టడానికి రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నామని కార్యదర్శులు వాపోతున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే గ్రామాల్లో పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టేవారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యంతో వ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు వాపోతున్నారు.



చెత్తను సేకరిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పారిశుద్ధ్య నిర్వహణ



గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా ఉండేలా పంచాయతీ కార్యదర్శులతో ప్రతీ వారం సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం. వర్షాకాలంలో వచ్చే సీజన్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. పెండింగ్ బిల్లులు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య నిర్వహణలో జాప్యం లేకుండా చూస్తున్నాం.
– అపర్ణ, ఎంపీడీఓ, షాబాద్

వాహనాల తనిఖీలు



వాహనాల తనిఖీ చేస్తున్న గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం కుర్మిద్ద–మీర్‌ఖాన్‌పేట గ్రామాల మధ్యన రహదారిపై వాహనాల తనిఖీలు చేపట్టారు. సీఐ లిక్కి కృష్ణంరాజు రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కార్లు, ఇతర వాహనాల్లో ఏం తరలిస్తున్నారో పరిశీలించారు. వాహనాలు నడిపేవారు, ఆర్‌సీ, లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. అతి వేగంతో ప్రమాదాలకు గురి కావద్దని చెప్పారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఇంజన్‌లో మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన భారత్ పెట్రోల్ పంపులో పెను ప్రమాదం తప్పింది. కారులో పెట్రోల్ పోయించుకుని వెళ్తుండగా మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన సుదర్శన్ తన క్విడ్ కారులో షాద్‌నగర్ నుంచి వచ్చి మైలార్‌దేవ్‌పల్లిలోని భారత్ పెట్రోల్ పంపులో పెట్రోల్ పోయించుకున్నాడు. తిరిగి వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ పంపు సిబ్బంది ఫైర్ సిలిండర్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో వాహనాదారులు భయాందోళనకు గురయ్యారు.

ఫ్రిడ్జ్ పేలి గృహోపకరణాలు దగ్ధం



కాలిపోయిన వస్తువులు

అమీర్‌పేట: ఫ్రిడ్జ్ పేలి ఇంట్లోని వస్తువులు కాలిపోయిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ రాజరాజేశ్వరీనగర్‌లో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన రవి భార్య, కుమారుడితో కలిసి రాజరాజేశ్వరి నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్యా, భర్తలు నీళ్ల తెచ్చేందుకు కిందకు వెళ్లగా మూడో అంతస్తులోని వారి ఇంట్లో ఫ్రిడ్జ్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో పేలిపోయింది. మంటలు ఇంట్లో ఉన్న సామగ్రికి వ్యాపించడంతో కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా లేక ఫ్రిడ్జ్ కంప్రెషర్ పేలి ప్రమాదం జరిగిందా అనేది తెలియాల్సి ఉందని ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపారు.

భారీగా డ్రగ్స్ పట్టివేత

ఉప్పల్: రాష్ట్ర ఈగల్ టీం అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠా గుట్టును రట్టు చేసింది. రాచకొండ డ్రగ్స్ నార్కొటిక్ బృందం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న ఉప్పల్ క్రికెట్ స్టేడియం పార్కింగ్ గ్రౌండ్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఈగల్ టీం మాటు వేసింది. ఆ ప్రాంతంలో తచ్చాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేయగా వారి నుంచి 200 గ్రాముల ఒజి కుష్, 32 ఎక్స్‌టసీ మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ. 10 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా సికింద్రాబాద్ సింధీ కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి కామటం మోహిత్, మధ్యప్రదేశ్‌కు చెందిన పాత వాహనాల వ్యాపారి స్వప్నిల్ వార్తెగా గుర్తించారు. తరచూ పబ్‌లకు వెళ్లే మోహిత్ డ్రగ్స్‌కు బానిసయ్యాడు. తన అవసరాల కోసం ఆన్‌లైన్, కొరియర్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకునే అతను వాటిని అవసరమైన వారికి విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో స్వప్నిల్ వార్తే మధ్యప్రదేశ్ నుంచి బస్సులో ఓజికుష్ నగరానికి తీసుకు వచ్చి మోహిత్‌కు విక్రయించే వాడు. మంగళవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద పార్కింగ్ గ్రౌండ్‌లో అతను మోహిత్‌కు డ్రగ్స్ అందిస్తుండగా రాచకొండ డ్రగ్స్ నార్కొటిక్ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ ఆపరేషన్‌లో ప్రవీణ్ కుమార్, రామ్ ప్రసాద్, ఎస్ఐ జీవన్ రెడ్డి, చెన్నరాయుడు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెల మృతి



గేదె కళేబరం

మొయినాబాద్: విద్యుదాఘాతంతో రెండు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్‌నగర్‌కు చెందిన గుంటి పోచయ్య గేదెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వాటిని మేత మేయడానికి వదిలాడు. హిమాయత్‌నగర్ రెవెన్యూలో తెగి పడిన విద్యుత్ తీగలకు తగిలాయి. దీంతో కరెంటు షాక్‌తో రెండు గేదెలు మృతి చెందాయి. రాత్రయినా గేదెలు రాకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. గురువారం ఉదయం గేదెల కళేబరాలు కనిపించాయి. బాధితుడు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని.. నష్టపోయిన తమను ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

సకాలంలో రక్తం అందక బాలింత మృతి

మలక్‌పేట: సకాలంలో రక్తం అందక బాలింత మృతి చెందిన సంఘటన మలక్‌పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలు కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..అక్బర్‌బాగ్‌కు చెందిన సురేష్ భార్య నెమలిక(21) ప్రసవం నిమిత్తం మంగళవారం మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో చేరింది. బుధవారం ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆమెకు తీవ్రరక్త స్రావం కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో, ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేనందున ఆమెను కోఠి మెటర్నిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సకాలంలో వైద్యం అందనందునే నెమలిక మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు గురువారం ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. వందల కాన్పులు జరిగే ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

తల్లి సహకారంతో తండ్రిని హత్యచేశాడు

- మైనర్‌తోపాటు ఇద్దరి అరెస్ట్
- జువైనల్ హోంకు బాలుడి తరలింపు

నాగోలు: డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదని స్నేహితుడు (మైనర్ బాలుడి), తల్లి సహకారంతో తండ్రిని హత్య చేసిన నిందితుని, సహకరించి తల్లిని పోలీసులు గురువారం నాగోలు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య చేసిన మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్ తెలిపిన మేరకు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్ మహతొ పది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలో జ్యూస్ పాయింట్ నిర్వహిస్తున్నాడు.మూడు సంవత్సరాల క్రితం భార్య క్రాంతి దేవి, కుమారులు రాజేందర్‌కుమార్, రాజేష్‌లను కాచిగూడకు తీసుకు వచ్చి తన సమీపంలో మరో జ్యూస్ పాయింట్ పెట్టించాడు. అందరూ కలిసి కాచిగూడలోని వీరన్నగుట్ట లో నివాసం ఉంటున్నారు. అశోక్ మహతొ తను సంపాదించిన డబ్బులను తన కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా తన తమ్ముళ్లకు ఇవ్వడంతో తన కుమారుడికి, భార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. అశోక్ మహతొ అయిదు రోజుల క్రితం తనకు తెలిసిన వ్యక్తిని పంపించి తన పెద్ద కుమారుడిని కొట్టించగా అది మనసులో పెట్టుకొని అశోక్ మహతొ పెద్ద కుమారుడు రాజేందర్ కుమార్ యాదవ్, అతని భార్య క్రాంతి దేవిలు కలిసి అశోక్ మహతొను హత్య చేయాలని ప్లాన్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అశోక్ మహతొ ను జూన్ 30 న అర్ధరాత్రి సుమారు ఒంటిగంట సమయంలో పెద్ద కుమారుడు కొత్తపేటలోని ఉన్న టీకౌంటర్ ను చూసివద్దామని చెప్పి ఒక మైనర్ బాలుడిని వెంట పెట్టుకొని తన ద్విచక్ర వాహనంపైన కొత్తపేట్ నుండి ఓఆర్ ఆర్ మార్గంలో పసుమాముల సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. వెంట తెచ్చుకున్న బిస్ ను కొట్టే బ్యాటు సహాయంతో మైనర్ బాలుడు, రాజేందర్ కుమార్ యాదవ్ కలిసి అశోక్ మహతొ ను తలపై దాడి చేయడంలో తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఈనెల 1 వ తేదీన హత్య జరిగిన సంఘటన తెలుసుకున్న నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్య అనంతరం భార్య, కుమారులు పరారీలో ఉండటంలో పోలీసులు వారిపై అనుమానం రావడంతో బుధవారం రాత్రి నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. హత్య చేసినట్లు హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో భార్య, పెద్దకుమారుడు రాజేందర్‌కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

క్రిష్ ఇన్ హోటల్ కిచెన్‌లో అగ్ని ప్రమాదం



హోటల్ నుంచి మహిళను బయటికి తీసుకు వస్తున్న సిబ్బంది

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ క్రిష్ హోటల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి.దీంతో అప్రమత్తమైన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చిరు. వివరాల్లోకి వెళితే..ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఐదు అంతస్తుల భవనంలో క్రిష్ హోటల్‌తో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లో కాఫీ డే పేరుతో రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు.క్రిష్ హోటల్ కిచెన్‌లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగిసి పడ్డాయి. దట్టమైన పొగలు రావడంతో హోటల్‌లో పనిచేసే నలుగురు సిబ్బందితో పాటు ఇద్దరు కస్టమర్లు కిందకు దిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వారు భవనం పైకి ఎక్కి ఆర్తనాదాలు చేశారు. మరో యువకుడు హోటల్ కిటికీ పగులగొట్టి కిందకు దూకేందుకు యత్నించగా చేతికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న సనత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అప్పటికే అక్కడికి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది భవనంపై చిక్కుకున్న సిబ్బంది, కస్టమర్లను సురక్షితంగా కిందకు దింపారు. పొగ పీల్చుకుని ఇబ్బంది పడుతునకన ఓ మహిళకు ఆక్సిజన్ అందజేసి వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

సికింద్రాబాద్: మానసిక సమస్యలతో బాధపడుతున్న బీటెక్ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్ల చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బెల్లెపల్లికి చెందిన చీర సాయిప్రకాశ్ (22) నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న అతను బుధవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ, కృష్ణానగర్ నాలాలో గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.